జెండా ఊంచా రహే.. హమారా

స్వాతంత్ర్య వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. పార్టీలకు అతీతంగా అందరూ మువ్వన్నెల జెండా ఎగురవేసి భరతమాతకు సెల్యూట్ చేశారు. నాటి త్యాగధనుల స్ఫూర్తిని, స్వాతంత్ర్యం కోసం సర్వం అర్పించిన సమరయోధులను గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు.

- రెపరెపలాడిన జాతీయ పతాక
- నాటి త్యాగధనులకు పలువురు నివాళి


జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు

సీతంపేట: స్వాతంత్ర్య వేడుకలు మంగళవారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. వాడవాడలా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య పోరాటం కోసం త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకున్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు వార్డులో పలుచోట్ల జెండా ఎగుర వేశారు. ముస్లిం తాటిచెట్లపాలెం జీవీఎంసీ ఉర్దూ పాఠశాలలో, కనకదుర్గా ఆటో స్టాండ్, రిక్షా స్టాండు, సౌండ్స్ అండ్ లైటింగ్ అసోసియేషన్స్, వార్డు కార్యాలయం, నందగిరినగర్ సేవా సంఘం వద్ద ఆయన జెండా వందనం చేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మధురానగర్ జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, సీతంపేట ప్రాథమిక పాఠశాలల్లో, 134 సచివాలయంలోనూ, సీతంపేట, రాజేంద్రనగర్, గణేష్‌నగర్ ఆటో స్టాండ్ల వద్ద, రాక్‌స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వద్ద జెండా ఎగురవేశారు. స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.సి.రెడ్డి జెండా ఎగురవేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, పాలకవర్గ సభ్యులు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, తదితరులు పాల్గొన్నారు. ఎన్జీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో, అక్కయ్యపాలెం ఆటోస్టాండ్‌లో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి జెండా ఎగురవేశారు. మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యదర్శి కనిసెట్టి అప్పారావు జెండా వందనం చేశారు. అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, వేద పండితులు పాల్గొన్నారు. సంఘం ఆఫీస్‌లో అధ్యక్షుడు రాజగిరి సింహాచలం జెండా ఎగురవేశారు.

మద్దిలపాలెం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా రెపరెపలాడింది. పలు వార్డుల కార్పొరేటర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాలలు, కార్యాలయాల్లో తిరంగా వేడుక నిర్వహించారు.

50వ వార్డులో...

వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తొలుత జాతీయ జెండాను వార్డు కార్యాలయంలో ఎగురవేసి వందనం చేశారు. అనంతరం పలువురి ఆహ్వానం మేరకు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, గాయత్రి విద్యామందిర్, శ్రీమాధవ యువజన సమాజం సత్యానగర్ ఓనర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ తదితర ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు.

51వ వార్డులో..

కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వార్డు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి, వందనం చేశారు. అనంతరం సచివాలయం, అంబేడ్కర్ కాలనీ ఆది ఆంధ్ర సేవాసంఘం, జైభీం సేవాసంఘం, లేన్సమ్‌గ్రీన్స్ అపార్ట్‌మెంట్, ఎంఎస్ఆర్ పార్క్, గాంధీనగర్, భీంనగర్, మహత్ కాలనీలో జెండా ఆవిష్కరించారు.

53వ వార్డులో..

కార్పొరేటర్ బర్కత్ అలీ పార్వతీనగర్, నరేంద్రనగర్ సచివాలయలం, మద్దిపాలెం రిక్షాస్టాండ్, గ్రీన్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆహ్వానం మేరకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ ఫారూకీ, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో...

సీఐ ఎస్. సాయి ఆధ్వర్యంలో సిబ్బంది జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌లు రవికిషోర్, షేక్ సమీర్, ఏఎస్‌ఐలు సతీష్, ఆదిరాజు, కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.

పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో..

సీతమ్మధార : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీతమ్మధారలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ సంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏపీఈపీడీసీఎల్‌లో సీఎండీ పృథ్వీతేజ్, ఉత్తర నియోజకవర్గంలో నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎన్ఎంసీహెచ్ హైస్కూల్లో హెచ్ఎం రాంప్రసాద్, 24వ వార్డులోని కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, సీతమ్మధార రైతు బజారులో ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు, బీజేపీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. ఫోర్తుటౌన్, ద్వారకా పోలీస్‌స్టేషన్లలో సీఐలు శ్రీనివాసరావు, సీహెచ్ సింహాద్రినాయుడు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్‌లో సీఎండీ పృథ్వీతేజ్ ప్రతిభ కనబరిచిన 66 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. అలాగే ఉత్తర పార్టీ కార్యాలయంలో కె.కె. రాజు మాట్లాడుతూ నాటి మహనీయుల త్యాగఫలితంగా నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చగలుగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, మాజీ వుడా చైర్మన్ రవిరాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, సారిపల్లి గోవింద్, పి.ఉషశ్రీ, బర్కత్ అలీ, మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, జగదీష్, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం..

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్ సచివాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాకారం అవుతుందన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో..

కంచరపాలెం ఇందిరానగర్‌లోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్.రాంబాబు, పద్మ, అప్పారావు, హేమంత్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

48వ వార్డులో..

కంచరపాలెం కొండవాలు ప్రాంతం బాపూజీనగర్, రామకృష్ణనగర్, శ్రీనివాసనగర్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వార్డు కార్పొరేటర్ గంకల కవిత జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో..

ఐటీఐ కూడలి పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఓల్డ్ ఐటీఐ రీజనల్ డైరెక్టర్ ఆర్‌వీ రమణ హాజరై జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్‌లోని జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు జెండా వందనం చేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.


ఏపీఈపీడీసీఎల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్


సత్యసాయినగర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పైడిరమణ, కారుకొండ రాజు

స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. నడక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయప్రభాశర్మ, రోజారాణి జెండా వందనం చేశారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. శ్రీదేవి విజ్ఞానజ్యోతి పురస్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధర్యంలో చైర్‌పర్సన్ కుప్పిలి కీర్తిపట్నాయక్ జెండా వందనం చేసి, మొక్కలు పంపిణీ చేశారు. మాధవధార ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె పుస్తకాలు పంపిణీ చేశారు. మురళీనగర్ సెక్టార్–8లోని బాలభాను పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుతరామరాజు పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్, పాఠశాల పూర్వ అధ్యక్షుడు మాస్టర్ కె.పార్వతీకుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ శుభశ్రీ పాల్గొన్నారు. తెన్నేటినగర్‌లోని పార్కులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు వెంకటగిరి జెండా వందనం చేశారు.

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్‌లో విజయదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో గ్రామ ప్రెసిడెంట్ కారుకొండ రాజు ఆధ్వర్యంలో ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ జెండా ఎగురవేశారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను కాలనీలోని పేద మహిళలకు అందజేశారు. కాలనీలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. తాటిచెట్లపాలెం సంతోషిమాత గుడి దగ్గర వైఎస్సార్‌సీపీ నార్త్ బీసీ సెల్ అధ్యక్షుడు బొడ్డేటి గంగామహేష్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు జెండా వందనం చేశారు. దుప్పలపూడి శ్రీనివాస్, కేపీ రత్నాకర్, పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, ద్వారం సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


శ్రీలలితాపీఠంలో జెండా ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి


బుల్లయ్య కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


నరేంద్రనగర్ సచివాయలంలో జెండా ఎగురవేస్తున్న 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ


నక్కవానిపాలెంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి


శాంతినగర్‌లో జాతీయ జెండాను ఎగుర వేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు


ఐటీఐలో వందన సమర్పణ స్వీకరిస్తున్న ఆర్‌డీడీ ఆర్‌వీ రమణ


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో స్వాతంత్ర్య వేడుకల్లో సనపల వరప్రసాద్, పార్కు సభ్యులు


గాంధీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న 51వ వార్డు కార్పొరేటర్ వెంకటరమణ


కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో జెండా పండగ అనంతరం సీఐ సాయితో ఎస్ఐలు, ఏఎస్ఐలు, చిన్నారులు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం : ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో అధిక శ్రావణ మాస శుద్ధ చతుర్దశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంధ పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూతి, పుష్పాలతో అర్చన చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు


డ్యాన్స్ పోటీల విజేతలతో అతిథులు

సీతంపేట : మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ వ్యవస్థాపకులు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్ జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్, ప్రతినిధులు మహ్మద్‌తాజ్, పి.మురళీకృష్ణ, పీఎస్ రావు, టి.పార్థసారథి, జాస్మిన్, పి.సంతోష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు పాల్గొని జెండా ఎగుర వేశారు. అనంతరం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కేకే రాజు కూడా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, శివాజీరాజు, డీఎస్పీ వర్మ, పృథ్వీరాజు, శ్రావణ వర్మ, క్షత్రియ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


చీరలు అందజేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్

సీతంపేట: గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఎగుర వేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ళ త్రినాథ్, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రిలో రిక్రియేషన్ హాల్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డాక్టర్ జయ నాగరాజ రిక్రియేషన్ హాల్‌ను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఇ.పెదవీర్రాజు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగుర వేసి, మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి, మౌలిక వసతుల కల్పనపై హర్షం వ్యక్తం చేశారు. రిక్రియేషన్ హాల్‌లో మినీ థియేటర్, దిన పత్రికలు, వార పత్రికలు, చెస్, క్యారమ్స్ వంటి ఆట వస్తువులను అందుబాటులో ఉంచినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. అనంతరం ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న డాక్టర్ ప్రజ్ఞమిత్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ వి.విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.


రిక్రియేషన్ హాల్ ప్రారంభిస్తున్న డాక్టర్ పెదవీర్రాజు

సృజనాత్మక ఆలోచనలకు సహకారం

ఏయూ క్యాంపస్: సృజనాత్మక ఆలోచనలకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహిస్తున్న 'ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సామర్థ్యాల పెంపు' ఒక రోజు వర్క్‌షాప్ పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ నెల 31న నిర్వహించే ఈ కార్యక్రమంలో ఏయూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులు భాగస్వాములు అవుతారు. అత్యుత్తమమైన 5 ఆలోచనలను ఎంపిక చేసి ఏయూ ఆ హబ్‌లో స్థానం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య కె.రమాసుధ, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దిపాలెం: ఇంటి పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాంజీ ఎస్టేట్స్ పెదకొత్తూరు ప్రాంతానికి చెందిన రత్తి శ్రీనివాసరావు(32) అనే వ్యక్తి ఈ నెల 10న మెడ మీద గాజుపెంకుతో కోసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసి సమీపంలో ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి వచ్చాక ఈ నెల 11న ఉదయం 5 గంటలకు ఇంటి రెండో అంతస్తుపైకి వెళ్లి ప్రమాదవశాత్తు వెనక వైపు ఉన్న గెడ్డలోకి జారిపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11 గంటలకు ఆయన మృతిచెందాడు. మంగళవారం ఉదయం శ్రీనివాసరావు సోదరి కుమిలి రోజా ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన మానసిక పరిస్థితి బాగులేక గత ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అలరించిన శ్రీకృష్ణ రాయబారం

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మురళీనగర్ వాకర్స్ పార్కులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకం ఆద్యంతం అలరించింది. నంది పురస్కార గ్రహీతలు శ్రీసాయి కళా నికేతన్ నటులు రాయబార సభలో తమ నట విశ్వరూపాన్ని చూపారు. శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు మధ్య జరిగిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. నంది అవార్డు గ్రహీతలు బగాది రితీష్ చంద్(శ్రీకృష్ణుడిగా, బి.విజయసారథి దుర్యోధనుడిగా, బీవీఏ నాయుడు ధృతరాష్ట్రుడుగా, అచంట వెంకటరత్నం అశ్వత్థామగా నటించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఇతర కార్యవర్గ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకంలో ఒక దృశ్యం

యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార : సీతంపేట గణేష్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఫ్యానుకు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ద్వారకా పోలీసులు అందించిన వివరాలిలా వున్నాయి. గణేష్‌నగర్‌లో నివాసముంటున్న పి. రామ్‌ప్రసాద్ (30)ది కోనసీమ జిల్లా మామిడివరం గ్రామం. మంగళవారం సమాచారం రావడంతో ద్వారకానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ధర్మేంద్ర సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్న రామప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సమాచారం మృతుని తల్లిదండ్రులకు అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలోనే సూసైడ్ నోట్ దొరికింది. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

శాకంబరి అలంకరణలో భూలోకమాత

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారి పక్కన ఉన్న భూలోకమాత నెల రోజుల పండగలో భాగంగా మంగళవారం శాకంబరి అలంకరణలో కనువిందు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు.

కారు ఎత్తుకెళ్లిన ముగ్గురు వ్యక్తులపై ఫిర్యాదు

మద్దిపాలెం : ప్రమాదంలో కారు ధ్వంసం కావటంతో కంపెనీ వేరే కారు వాడుకోవడానికి ఇస్తే ఆ కారు తిరిగి కంపెనీకి ఇవ్వకుండా తప్పించుకుంటున్న ముగ్గురు వ్యక్తులపై ఓ కారు కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఈ ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2020లో ఎం.సతీష్‌కుమార్ అనే వ్యక్తి స్కోడా కారు కొన్నారు. అది టిఎస్13 ఈఎస్ 6464 రిజిస్ట్రేషన్‌తో ఉంది. తర్వాత జరిగిన ప్రమాదంలో ఆ కారు ధ్వంసం అయింది. 22 ఏప్రిల్ 2021లో సదరు కారు కొన్న వ్యక్తి ఆ కారును 104 ఏరియా మహావీర్ స్కోడా షోరూంలో గౌతం, పల్లంరాజు అనే ఇద్దరు స్నేహితులతో కలిసి బాగు చేయడానికి ఇచ్చారు. అయితే కారు ముందు భాగం ధ్వంసం కావడంతో, కంపెనీ వారు కారును పరిశీలించి, కొన్ని కొత్త పార్ట్‌లు వేయాలని, స్పేర్ పార్ట్స్ రావడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. కారు లేక ఇబ్బందిగా ఉందని, వేరే కారు ఇవ్వాలని ఆ ముగ్గురు వ్యక్తులు యాజమాన్యాన్ని కోరారు. అతను కొన్న కారు కంటే ఖరీదైన హైఎండ్ వెర్షన్‌ను (ఏపీ39సివి9025) ఒక లెటర్ రాయించుకుని కంపెనీ వారు ఇచ్చారు. కొంత కాలానికి కారు మరమ్మతు పూర్తయిందని సదరు కారు యజమానికి ఫోన్ చేయగా స్పందించలేదు. ఈ విషయమై షోరూం వారు పదే పదే సమాచారం అందించాలని చూస్తున్నా సదరు వ్యక్తులు స్పందించకపోవడంతో ముగ్గురు వ్యక్తులపై షోరూం మేనేజర్ సురేష్‌వర్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును అనుసరించి ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారో పోలీసులు తెలుసుకుంటున్నారు. సీఐ ఎస్. సాయి నేతృత్వంలో ఎస్ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. సదరు కారు యజమాని ఎక్కడి వారు, ఏ ప్రాంతానికి చెందిన వారు అన్నది ఇంకా తెలియాల్సి ఉంది.